క్లుప్తంగా

బీజేపీలో చేరిక



నర్సంపేట : నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమని బీజేపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు నర్సంపేటకు చెందిన ఏకలవ్య యువజన సంఘం నాయకులు రాయపురం హరీష్, మహేష్, పాలకుర్తి నరేందర్, కార్తీక్, రాకేష్, శ్రీరామరాజు, కూతాటి మహేందర్, రాజేష్, మహేష్, వనం శ్రీనివాస్, పాలకుర్తి మహేష్, శివరాజ్, విజయ్‌తో పాటు మరికొందరు రాణాప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీ చేరారు. బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

'ఆధార్' పునఃప్రారంభించాలి



నల్లబెల్లి : మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని పునః ప్రారంభించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు సాంబయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆధార్ కార్డు సేవలు అందుబాటులో లేకపోవడంతో స్థానికులు నర్సంపేటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ మండల మాజీ అధ్యక్షుడు పరికి రత్నం తదితరులు అన్నారు.

ప్రాంగణ నియామకాలు



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రాంగణ నియామకాలు చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్ తెలిపారు. ఈ ప్రాంగణ నియామకాలు ఎల్‌డీఆర్‌ఏ ఆధ్వర్యంలో చేపట్టగా 270మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోని రాతపరీక్ష, గ్రూప్ డిష్కర్షన్, హెచ్ఆర్ రౌండ్ వంటి అర్హత పరీక్షలు నిర్వహించారు. అందులో ప్రతిభ కనబర్చిన 18మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందన్నారు.

ధ్వజస్తంభాన్ని తగులబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేట గ్రామంలోని లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ ధ్వజ స్తంభాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టి ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం ఆలయ పూజారి రాంకీచార్యులు ధ్వజస్తంభం కాలిపోవడాన్ని గమనించి ఇరుగు పొరుగు వారికి సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి నీరు పోసి మంటలు ఆర్పివేశారు. అప్పటికే కొంత మేరకు కాలిపోయింది. సంఘటన స్థలాన్ని ఎస్సై నవీన్‌కుమార్ సందర్శించారు. ఆలయ పూజారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అర్థమయ్యేలా బోధించాలి



ఖానాపురం : విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని బుధరావుపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన దివ్యాంగ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్‌ను మంగళవారం సన్మానించారు. సర్పంచ్ శాఖమూరి చిరంజీవి, దూలం రాజేందర్, అన్వర్‌పాష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

సంగెం : మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నేడు(బుధవారం) ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొమురయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు జలదీక్ష

వర్ధన్నపేట : తెలంగాణ జనసమితి(టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్ ఆధ్వర్యంలో కృష్ణా నది జలాల సాధనకై నేడు హైదరాబాద్‌లో దీక్ష చేపట్టనున్నట్లు జిల్లా కార్యదర్శి ఎలిశాల రాజేష్ మంగళవారం తెలిపారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ నేడు అప్పుల రాష్ట్రంగా మారిందన్నారు. దీక్షకు అధిక సంఖ్యలో టీజేఎస్ నాయకులు కార్యకర్తలు, సబ్బండ వర్గాల ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి



చెన్నారావుపేట: మాట్లాడుతున్న ఎంపీపీ విజేందర్



రాయపర్తి: మండల పరిషత్ కార్యాలయంలో..



పర్వతగిరి: మాట్లాడుతున్న జెడ్పీటీసీ సింగ్‌లాల్



నల్లబెల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

చెన్నారావుపేట : ఈ నెల 18 నుంచి రెండో విడత 'కంటి వెలుగు' కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు బాదావత్ విజేందర్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో కంటి వెలుగు కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, ఎంపీడీఓ కూచన ప్రకాష్, డాక్టర్ సుమన్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మంజుల, రాధ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుండె మల్లయ్య, కార్యదర్శి అనుముల కుమారస్వామి, తదితరులు ఉన్నారు.

పర్వతగిరిలో..

పర్వతగిరి : కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ బానోత్ సింగ్‌లాల్ కోరారు. ఈ మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ చక్రాల సంతోష్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ ఉదయ్‌లు మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి ప్రణాళిక ద్వారా ఈ కార్యక్రమాన్ని వినియోగించుకునేలా చూడాలన్నారు.

నేత్రాలను కాపాడుకునేలా చైతన్యం చేయాలి

రాయపర్తి : నేత్రాల పట్ల చిన్న సమస్యే కదా అని వదిలేస్తే ప్రపంచాన్ని చూడడం కోల్పోతామని నేత్రాలను కాపాడుకునేలా ప్రజలను చైతన్యం చేయాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, పంచాయతీకార్యదర్శులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ నరేష్‌కుమార్‌నాయుడు, తహసీల్దార్ కుసుమ సత్యనారాయణ, ఎంపీడీఓ కిషన్, వైద్యాధికారి వెంకటేష్, ఏపీఎం అశోక్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, పంచాయతీకార్యదర్శులు పాల్గొన్నారు.

నల్లబెల్లిలో..

నల్లబెల్లి : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రెండో విడత కంటి వెలుగు సన్నాహక సమావేశం నిర్వహించగా ఎంపీపీ ఊడుగుల సునీత పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ విజయ్ కుమార్, వైద్యాధికారి శశికుమార్, సర్పంచ్ నానబోయిన రాజారాం తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు రద్దు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

నర్సంపేట : పాత రోడ్డుకు కొత్త టెండర్లను పిలవడాన్ని రద్దు చేయాలని నర్సంపేట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్, (స్థానిక సంస్థలు)కు మంగళవారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబయ్యగౌడ్ మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో గత ఆరు సంవత్సరాల క్రితం పోసిన సీసీ రోడ్డును నూతనంగా రోడ్డు నిర్మిస్తున్నట్లు సృష్టించి రూ.12లక్షలు కాంట్రాక్టర్‌కు అప్పగించడం కోసం టెండర్ వేశారన్నారు. టెండర్ వల్ల కాంట్రాక్టర్ జేబులు నింపడంతో పాటు కమిషనర్, చైర్‌పర్సన్లు కమీషన్లు చేజిక్కించుకుంటారని ఆరోపించారు. పట్టణంలో డ్రెయినేజీలు పూర్తిగా శిథిలమై అస్తవ్యస్తంగా ఉంటే అభివృద్ధి చెందాల్సిన ప్రాంతాలకు నిధులు కేటాయించకుండా పాత పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చేసే పనిలో పడ్డారన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ మాట్లాడుతూ పట్టణంలోని మల్లంపల్లి రోడ్డు సమీపంలో మిట్టకాల్వపై ప్రభుత్వ భూమిలో ఇల్లు నిర్మిస్తున్న వారికి చైర్‌పర్సన్, కమిషనర్ సహకరిస్తూ ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్న పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎలకంటి విజయ్‌కుమార్, ఓర్సు అంజలి అశోక్, ములుకల వినోదసాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985–86 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి తరగతి గదులను పరిశీలించి అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు పలకరిస్తూ కష్టసుఖాలు పంచుకున్నారు. కష్టాల్లో ఉన్న సహచరులను ఆదుకోవాలని తీర్మానించుకున్నారు. పెండెం తిరుపతి, ఓరుగంటి తిరుపతి, గుడిపెల్లి ధర్మారెడ్డి, నర్ర రంగారెడ్డి, వేముల రవీందర్, కీసరి ఐలయ్య, కొండబత్తుల రవీందర్, అంచూరి నాగయ్యతో పాటు 50మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'భక్తులకు ఇబ్బంది కలగొద్దు'

ఐనవోలు : ఈనెల 13 నుంచి జరగనున్న ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని మామునూరు ఏసీపీ నరేశ్‌కుమార్ అన్నారు. పోలీస్ శాఖ నిర్వహించే క్రైమ్ మీటింగ్ మామునూరు ఏసీపీ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతరకు లక్షలాదిగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని, ఈ మేరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకన్నలకు తెలియజేశారు. సుమారు 400 మంది పోలీస్ సిబ్బందితో నాలుగు రోజులపాటు నిర్వహించే బందోబస్తు అంశంపై లోకల్ ఇన్‌స్పెక్టర్లు సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో మామునూరు, సంగెం, పర్వతగిరి, గీసుకొండ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐనవోలు ఆలయ ట్రస్టు బోర్డు నియామకం

ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయ ట్రస్టు బోర్డును నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి వి.అనిల్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 14 మంది సభ్యులు, ఒక ఎక్స్ అఫీషియో మెంబర్‌తో కమిటీని ప్రకటించారు. సభ్యులుగా మజ్జిగ జైపాల్, మందపురి రాజబాబు, పొన్న వీరస్వామి, బండి సాయిలు, రామిండ్ల స్వప్న, లక్ష్మణ్, అబర్ల సాయిలు, గోక రాజు, బొళ్లెపెల్లి వెంకటేశ్వర్లు, పాక ఉపేందర్, మండల సత్తయ్య, చెవ్వ రాజు, మండల సమ్మిరెడ్డి, దుప్పెల్లి శారద నియమితులయ్యారు. ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్‌ను నియమించారు.

మహాసభలను విజయవంతం చేయండి



నల్లబెల్లి: వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



గీసుకొండ: వంచనగిరిలో..

నర్సంపేట : ఈనెల 18వ తేదీన ముంబయిలో జరిగే రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అంబేడ్కర్) జాతీయ స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆర్‌పీఐ(ఏ) రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024లో జరగబోయే సాధారణ శాసన సభ అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాష్ట్రాల్లో ఆర్‌పీఐ(ఏ) పార్టీ అభ్యర్థులను బరిలో దింపి రాజ్యాధికారం చేపట్టాలనే లక్ష్యంతో జాతీయ అధ్యక్షుడు దీపక్‌నికాల్జీ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్‌లాల్ పాటిల్‌లు ఉన్నారన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

గీసుకొండ : రంగారెడ్డి జిల్లా మన్నెగూడెంలో ఈ నెల 13, 14వ తేదీల్లో జరిగే టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దం వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వంచనగిరి జెడ్పీ పాఠశాల ఆవరణలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. సి.సుజన్‌ప్రసాద్‌రావు, బి.మల్సూర్, హెచ్‌ఎంలు ఎం.ముత్యాలు, కృష్ణమూర్తి, నటరాజ్, శ్యాంప్రసాద్, రాంగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : ఈ నెల 13, 14వ తేదీల్లో రంగారెడ్డి జిల్లా మన్నెగూడెంలో జరుగనున్న టీఎస్‌యూటీఎఫ్ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ రవూఫ్ అన్నారు. ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను ఆ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని రుద్రగూడెం హైస్కూల్ ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, అర్జున్ సాగర్, నాగంపల్లి రాజయ్య, ఎండీ రాయబోస్, యాదగిరి, రాజిరెడ్డి, రమేష్, నీలిమ, ఉర్మిళ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్ సూట్స్ పంపిణీ



నర్సంపేట : పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలోని 400మంది విద్యార్థులకు మంగళవారం ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, పీఈటీ ప్రశాంత్, ఆర్మీ డ్రిల్ ఇన్‌స్పెక్టర్ ప్రేంచంద్రశేఖర్ ట్రాక్ సూట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.కుమారస్వామి, వైస్ ప్రిన్సిపాల్ సమ్మునాయక్, శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అభినందన



రాయపర్తి : మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా పంచాయతీకార్యదర్శులు సంఘాన్ని ఏర్పాటు చేసుకోగా ఎన్నికైన వారికి ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, ఎంపీడీఓ కిషన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పరామర్శ



నల్లబెల్లి : మండలంలోని లెంకాలపల్లి గ్రామానికి చెందిన రవీందర్ విద్యుదాఘాతంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు గందె శ్రీనివాస్ గుప్త పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు రూ.5,500 ఆర్థికసాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి అశోక్, మామిడిపల్లి రాజు, కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, నరేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



ఎస్సై తిరుపతికి నగదు అందజేస్తున్న బాధ్యులు

ఖానాపురం : గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు సహకరించాలని ఎస్సై పిట్టల తిరుపతి అన్నారు. ఈ మేరకు మండలంలోని బుధరావుపేటలో ట్రాక్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.50,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే శాంతిభద్రతల రక్షణకు దోహదపడతాయన్నారు. గ్రామాల్లోని వ్యాపారస్తులు, ఉద్యోగులు, కుల సంఘాల బాధ్యులు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్నా నిఘా నేత్రాల్లో నిక్షిప్తమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కాస ప్రవీణ్‌కుమార్, కుమారస్వామి, చెడిపాక ఉపేందర్, శుక్రుమియా తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన దొంగల అరెస్టు



దొంగల అరెస్టు చూపుతున్న సీఐ, ఎస్సై

నెక్కొండ : తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడిన ఇద్దరు దొంగలను మంగళవారం పోలీసుల అరెస్టు చేశారు. నెక్కొండ సీఐ హథీరాం మాట్లాడుతూ.. మండలంలోని పెద్దకొర్పోలులో గతేడాది డిసెంబర్ 16న గ్రామానికి చెందిన బక్కి శంకర్ ఊరెళ్లాడు. దీంతో అతడి భార్య మంజుల ఇంటికి తాళం వేసి అదే గ్రామంలోని తన అమ్మగారింటికి వెళ్లగా చోరీ జరిగిన విషయం విదితమే. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టామని అన్నారు. కాగా మండల కేంద్రంలో పోలీసులు మంగళవారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో పెద్ద కొర్పోలు గ్రామానికి చెందిన గై. ప్రభాకర్, నెక్కొండకు చెందిన చింతల జయంత్‌కుమార్ అనుమానస్పదంగా కనిపించడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా ఇటీవల తామె దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలన్న దురుద్దేశంతో వీరు దొంగతనానికి పాలపడినట్లు తెలిపారు. వారి నుంచి సుమారు 6 తులాల బంగారు నగలను సాధీనం చేసుకొని, రిమాండ్ తరలించామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఎస్సై సీమాఫర్హీన్, పోలీసులు పాల్గొన్నారు.

చిలుకమ్మనగర్‌లో చోరీ

ఖానాపురం : మండలంలోని చిలుకమ్మనగర్ గ్రామంలో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.. స్థానికులతో పాటు బాధిత వ్యక్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొమ్ము వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కిరాణాషాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో డిసెంబర్ 30న షాపులో గుర్తు తెలియని వ్యక్తులు రూ.12వేల నగదుతో పాటు ఇతర సామగ్రి అపహరించుకుపోయారు. దీంతో రెండు రోజుల తర్వాత షాపు తీయగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. పలువురిపై అనుమానం వచ్చి వారిని నిలదీయగా ఒప్పుకున్నట్లు తెలిపారు. దీంతో ఈనెల 5న పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెంకటేశ్వర్లు మంగళవారం విలేకరులకు తెలిపారు. పోలీసులు వచ్చి విచారించి వెళ్లిపోయారని, ఆ తర్వాత తనకు ఎలాంటి న్యాయం జరగలేదని వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

వరిలో జాగ్రత్తలు తీసుకోవాలి

వర్ధన్నపేట : వరి పంటసాగులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుని తెగుళ్లు సోకకుండా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాంనర్సయ్య అన్నారు. మంగళవారం దమ్మన్నపేటలో వరి పంట క్షేత్రాలను సందర్శించి రైతులకు తగు సూచనలు సలహాలు అందజేశారు. సందర్శనలో కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. పిలక దశలో 8నుంచి 10 కేజీల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఇసుకలో కలిపి చల్లాలన్నారు.లేదా కార్బస్ హైడ్రోక్లోరైడ్ 50ఎస్‌పీ 2 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి పంటలో నీటి మట్టం తగ్గించుట లేదా ఒకటి రెండు రోజులు పొలంను ఆరబెట్టడం మంచిదన్నారు. దీని వల్ల మొక్క వేర్లు చురుకుగా ఉంటాయన్నారు. నేల నుంచి గాలిని, పోషకాలను సమర్థవంతంగా గ్రహించి పంట ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పంటపై కాంప్లెక్స్ ఎరువులు వడవద్దన్నారు. చిలేటెడ్ జింక్ 2 గ్రా. ఒక లీటరు నీటికి, 19:19:19 ఒక కేజీ, ఫార్ములా–4 ట్యాంక్‌కు 200 గ్రా యూరియా కలిపి చలి తీవ్రత ఉన్నం కాలం వారానికి రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. దీంతో పంట ఎదుగుల బాగా ఉంటుందన్నారు. ఈ సందర్శనలో స్థానిక రైతులు, ఏఈఓ కావ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ బాధ్యులు

నర్సంపేట : సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వడ్లకొండ సాంబయ్య, కోదాటి వీరస్వామి, చిలుముల సత్తయ్య, పోలీస్ మల్లయ్య, మోతె జైపాల్‌రెడ్డి, ఆర్.కొమురయ్య, గోక నాగేందర్, ఎం.రామస్వామి, దొంతి రాజిరెడ్డి పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని విద్యావనరుల కేంద్రంలో మంగళవారం జిల్లా ఏఎంఓ సారయ్య, ఎంఈఓ రత్నమాల, ఎంఎస్‌ఓ ఫ్లోరెన్స్, ఆంగోత్ భద్రయ్య డీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భద్రయ్య మాట్లాడుతూ.. ఈ నెల 2న నిజామాబాద్ జిల్లా కోటగిరి ఉన్నత పాఠశాలలో మల్లికార్జున్ అనే ఉపాధ్యాయుడిపై దాడి చేసి కులం పేరుతో దూషించి అవమాన పరిచిన వారిని వెంటనే అరెస్ట్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సరళ, కొమురయ్య, ఉమాశంకర్, నర్సయ్య, వీరన్న, కట్టస్వామి, వెంకటయ్య, రవి, మంజులరాణి తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ గ్రామంలోని విజ్ఞానభారతి విద్యాలయంలో మంగళవారం పాఠశాల నూతన సంవత్సర క్యాలెండర్‌ను కరస్పాండెంట్ అక్కినపెల్లి సతీష్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం అమ్ముకునేందుకు కష్టాలు

- పదిరోజులుగా మిల్లర్ల చుట్టూ ప్రదక్షిణలు
- కొనుగోలు కేంద్రంలో పడిగాపులు
- పట్టించుకోని నిర్వాహకులు
- న్యాయం చేయాలని రైతు వేడుకోలు



ధాన్యం లోడు ట్రాక్టర్ వద్ద రైతు యాదగిరిరావు

సంగెం : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మిల్లర్లు కొర్రీలు పెడుతుండడంతో ప్రశ్నించిన పాపానికి రైతు ధాన్యంను దిగుమతి చేసుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న సంఘటన మండలంలోని కాపులకనిపర్తి సొసైటీ పరిధిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు నడిపెల్లి యాదగిరిరావు తనకున్న 6 ఎకరాల్లో వరిసాగు చేశాడు. ధాన్యం అమ్ముకునేందుకు బార్‌దాన్ కావాలంటే నిర్వాహకులు రూ.10వేలు అడ్వాన్స్ ఇస్తేనే ఇచ్చారు. గతేడాది 31వ తేదీన కాపులకనిపర్తి సొసైటీ వారు సూచించిన ప్రకారం అదే గ్రామంలోని పలు మిల్లులకు తన ట్రాక్టర్‌లోనే 174 బస్తాల ధాన్యంను తరలించాడు. మిల్లర్లు కొర్రీలు పెట్టి బస్తాకు 5 కిలోల తరుగు తీస్తామని దానికి ఒప్పుకుని తెల్ల కాగితంపై సంతకం చేస్తేనే దిగుమతి చేసుకుంటామని చెప్పడంతో అందుకు అంగీకరించని రైతు తిరిగి ధాన్యం ట్రాక్టర్‌ను కొనుగోలు కేంద్రానికి తరలించాడు. పది రోజుల నుంచి మిల్లుల చుట్టూ తిరుగుతున్న పట్టించుకునేనాథుడే లేరని మంగళవారం విలేకర్లకు తన గోడు వెల్లబోసుకున్నాడు. కాగా విషయంపై కాపులకనిపర్తి సీఈఓ రమణచారిని వివరణ కోరితే శ్రీవాణి మిల్లర్‌తో మాట్లాడితే ఆ రైతు ధాన్యంను తాము తీసుకోబోమని తేల్చిచెప్పాడని దీనికి తాను ఏమి చేయలేనని చేతులేత్తేశారు. కాగా సదరు రైతు మిల్లర్లు బస్తాకు 4, 5 కిలోల చొప్పున తరుగు తీస్తున్నారని ఆర్డీఓకు చెప్పినందుకు తనపై కక్ష కట్టారని, మిల్లర్లు తన ధాన్యం కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకుని తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

స్వయం పరిపాలన దినోత్సవం



ఖానాపురం : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా డీఈఓగా యశ్వంత్, ఎంఈఓగా అభినయ్, హెచ్‌ఎంగా భవాని, పీఈటీలుగా ఆనంద్, హరీష్‌లతో పాటు పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కాగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దాత అన్వర్‌పాష అందించిన పెన్నులను ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, సర్పంచ్ శాఖమూరి చిరంజీవిలు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దూలం రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.